సాక్షి ఖమ్మం

శనివారం । 24 । ఫిబ్రవరి । 2024



గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమ్మె

స్పాన్సర్ బాంకు విధానాన్ని రద్దుచేసి ఇతర సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులు సమ్మెచేపట్టారు. 8లో



సర్దుబాటు సరే.. జీతాలేవి?

104 వ్యవస్థను రద్దుచేసి సిబ్బందిని ఇతర విభాగాల్లోకి సర్దుబాటు చేసిన అధికారులు వేతనాల చెల్లింపులో నిర్లక్ష్యం వహిస్తున్నారు. 8లో



వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శనివారం మంచు ప్రభావం ఉంటుంది. ఆతర్వాత ఎండ మొదలై మధ్యాహ్నానికి గరిష్టస్థాయికి చేరుతుంది.

న్యూస్‌రీల్

సమ్మక్క-సారలమ్మను దర్శించుకున్న ఎంపీ రవిచంద్ర



మేడారంలో అమ్మవార్ల గద్దెల వద్ద ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, కుటుంబీకులు

ఖమ్మంమయూరిసెంటర్: ములుగు జిల్లా మేడారంలో కొలువైన సమ్మక్క-సారలమ్మలను రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం తన కుటుంబ సభ్యులు, అనుచరులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ కమిటీ బాధ్యులు ఎంపీకి స్వాగతం పలకగా, తల్లులకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించిన ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే మేడారం వెళ్తున్న సందర్భంగా మార్గమధ్యలో ములుగు సమీపాన ఉన్న గట్టమ్మ తల్లిని సైతం ఎంపీ దర్శించుకున్నారు.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, ఎస్‌ఎస్‌సీతో సహా రాష్ట్రప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ పోటీ పరీక్షల కోసం ఎస్సీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యాన ఐదు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. అభ్యర్థులు మార్చి 6వ తేదీ లోపు టీఎస్ స్టడీసర్కిల్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే, మార్చి 10న నిర్వహించే పరీక్షలో మెరిట్ సాధించిన వంద మందిని ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. వీరికి మార్చి 18 నుండి ఆగస్టు 17వ తేదీ వరకు ఖమ్మంలోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత భోజనం, వసతి కల్పించి శిక్షణ ఇస్తామని తెలిపారు. వంద సీట్లల్లో 75 శాతం ఎస్సీలకు, 10 శాతం ఎస్టీలకు, 15 శాతం బీసీలకు రిజర్వేషన్ ఉంటుందని.. మొత్తంగా మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తామని, ఐదు సీట్లు దివ్యాంగులకు రిజర్వ్ చేస్తామని వెల్లడించారు. కాగా, గతంలో శిక్షణ పొందిన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకునేందుకు అనర్హులని డీడీ తెలిపారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఐఈఓ రవిబాబు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవిబాబు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. ఈనెల 28 నుండి ఇంటర్ పరీక్షలు జరగనుండగా, అధికారులు వారికి కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. కేంద్రాలను ముందుగానే పరిశీలించి ఫర్నీచర్, విద్యుత్, తాగునీరు సౌకర్యాలపై దృష్టి సారించాలని చెప్పారు. జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 36,578 మంది కోసం 70 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, సీసీ కెమెరా నిఘాలో మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాలకు సమీపంలో జిరాక్స్ కేంద్రాలు మూసివేయించాలని, 144 సెక్షన్ పక్కాగా అమలు చేయాలనీ రెవెన్యూ, పోలీస్ అధికారులను సూచించారు. ఈసమావేశంలో డాక్టర్ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, సింహాచలం, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

నేడు సహస్ర కలశాభిషేకం



బేడా మండపం వద్ద ఆవాహనం చేసిన కలశాలు

భద్రాచలం: భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శనివారం సహస్ర కలశాభిషేకం జరిపేందుకు అర్చకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం బేడా మండపంలో వెయ్యి కలశాలను వరుస క్రమంలో అమర్చి శాస్త్రోక్తంగా దేవతావాహనం నిర్వహించారు. యాగశాలలో పూజలు జరిపారు. శనివారం శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామికి సహస్ర కలశాభిషేకంతోపాటు శ్రీ రంగనాథ స్వామి వార్షిక తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శుక్ర, శనివారాల్లో నిత్యకల్యాణాలు రద్దు చేశారు.

- ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ సరఫరాకు కసరత్తు
- జిల్లాలో 3,55,905 మంది విద్యుత్ వినియోగదారుల వివరాలు సేకరణ
- సబ్సిడీ సిలిండర్లకు కొనసాగుతున్న సర్వే
- గ్యారంటీల అమలుకు సిద్ధమైన జిల్లా యంత్రాంగం

ఆరింట.. మరో రెండు!



ప్రభుత్వం ఆరు గ్యారంటీల అమలుకు వడివడిగా అడుగులు వేస్తోంది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రూ.10 లక్షల మేర ఆరోగ్యశ్రీలో వైద్యసేవలు ఇప్పటికే అందుబాటులోకి రాగా, మరో రెండింటి ప్రారంభానికి రంగం సిద్ధమైంది. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ పంపిణీపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇందుకు సంబంధించిన సర్వే ప్రక్రియ విద్యుత్ శాఖ పూర్తి చేయగా.. గ్యాస్ వినియోగదారుల సర్వే చివరి దశకు చేరింది. ఈనేపథ్యాన రెండు గ్యారంటీలను ఈనెల 27నుంచి అమలుచేయాలని ప్రభుత్వం ముహూర్తంగా నిర్ణయించడంతో దరఖాస్తుదారుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

ప్రజాపాలనలో దరఖాస్తులు

ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. గత నెలలో నిర్వహించిన ప్రజాపాలన సభల్లో దరఖాస్తులు స్వీకరించగా, సిబ్బంది ఆన్‌లైన్ చేశారు. కాగా, గ్రామీణ ప్రాంతాల నుంచి ఈ పథకాల అమలు కోరుతూ అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. అనంతరం ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే చేపట్టారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500కు గ్యాస్ సిలిండర్ల పథకంపై ప్రభుత్వం మార్గదర్శకాలను వెల్లడించింది.

విద్యుత్‌శాఖ సర్వే పూర్తి

200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ సరఫరాకు సంబంధించి సర్వే ప్రక్రియను శాఖ పూర్తి చేసింది. జిల్లాలో 4,27,171 గృహ వినియోగ కనెక్షన్లు ఉన్నాయి. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఈనెల 5 నుంచి 21వ తేదీ వరకు ఉద్యోగులు సర్వే చేస్తూ ఆధార్, రేషన్‌కార్డు, ఫోన్ నంబర్లను సేకరించారు. ఈ సందర్భంగా 3,55,905 మంది వివరాల సేకరణ పూర్తయింది. ఇప్పటివరకు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారు 3,85,222 మంది ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఇందులో పలువురు ఉచిత విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకోలేదు. దీంతో 3.55 లక్షల మంది వివరాలను సేకరించగా... వీరిలో అర్హులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయనున్నారు.

గ్యాస్ కోసం 4.88 లక్షల దరఖాస్తులు

ప్రభుత్వం రూ.500కు గ్యాస్ సిలిండర్ అందిస్తామని ప్రకటించగా, జిల్లావ్యాప్తంగా 4,88,316 దరఖాస్తులు అందాయి. ఈ దరఖాస్తుల పరిశీలనకు క్షేత్రస్థాయిలో చేపట్టిన సర్వే చివరి దశకు చేరింది. కాగా, ఈ పథకానికి సైతం పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల నుంచే ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో 3,78,852 దరఖాస్తులు జీపీల నుంచే రావడం గమనార్హం. ఈ పథకం అమలుకు సంబంధించి పౌరసరఫరాల శాఖ కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఉన్నతాధికారులు పౌరసరఫరాల శాఖ అధికారులకు మార్గదర్శకాలపై సూచనలు చేశారు.

సిద్ధంగా అధికారులు

ఆరు గ్యారంటీల అమలుపై ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉన్న నేపథ్యాన అధికారులు పథకాల అమలుకు సిద్ధమవుతున్నారు. 200 యూనిట్ల విద్యుత్, గ్యాస్ సిలిండర్ల సరఫరాపై లబ్ధిదారుల ఎంపిక ఓ కొలిక్కి వచ్చిన నేపథ్యాన ప్రభుత్వ మార్గదర్శకాలు అందగానే అమలుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోని వారికి అవకాశముందని సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా ప్రకటించడంతో దరఖాస్తులు, లబ్ధిదారుల సంఖ్యపై స్పష్టత రావడానికి కొంత సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా, దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, లబ్ధిదారు ఎంపిక నిరంతరంగా సాగుతుందని సీఎం చెప్పడంతో ప్రజాపాలన సభల్లో దరఖాస్తు చేసుకోని వారికి ఊరట లభించినట్లయింది.

డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ సరఫరా

- ఫిర్యాదుల స్వీకరణకు కంట్రోల్ రూం ఏర్పాటు
- ఎన్పీడీసీఎల్ ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్

ఖమ్మంవ్యవసాయం: వేసవి సీజన్‌లో విద్యుత్ సమస్య ఎదురుకాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎన్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ ఏ.సురేందర్ తెలిపారు. జిల్లాలోని విద్యుత్ అధికారులతో శుక్రవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వేసవిలో ఎంత డిమాండ్ పెరిగినా అవసరమైన మేర విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటున్నందున అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ రంగాలకు నిరంతరాయంగా సరఫరా ఉంటుందని తెలిపారు. కాగా, జిల్లాలో ఎక్కడా విద్యుత్ సంబంధిత సమస్యలు లేవని, ఒకవేళ సమస్య ఉంటే అధికారుల దృష్టికి రావాలని చెప్పారు. ఈ సమావేశంలో ఖమ్మం, సత్తుపల్లి, వైరా, ఖమ్మంరూరల్ డివిజన్ల అధికారులు, సబ్ స్టేషన్ల ఏఈలు పాల్గొన్నారు. ఇక ఖమ్మం టౌన్ డీఈ నంబూరి రామారావు కూడా డివిజన్ స్థాయి ఉద్యోగులతో సమావేశమై విద్యుత్ అంతరాయాలు ఎదురుకాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

విద్యుత్ సమస్యలు, అంతరాయాలను తెలుసుకునేందుకు ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. గృహ, వాణిజ్య, వ్యవసాయ తదితర వినియోగదారులు కంట్రోల్ రూం నంబర్ 94408 11525 కు ఫోన్ చేయొచ్చని ఎస్ఈ సూచించారు. ఇక్కడకు ఫోన్ రాగానే సంబంధిత ఉద్యోగులకు సమాచారం ఇచ్చి సమస్యను పరిష్కరిస్తామని ఆయన తెలిపారు.

పాఠశాలను తనిఖీ చేసిన జెడ్పీ చైర్మన్

బోనకల్: మండలంలోని లక్ష్మీపురం గోవిందాపురం ప్రభుత్వ పాఠశాలను జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇంగ్లిష్ ఉపాధ్యాయుల కొరత ఉందని చెప్పగా, డీఈఓతో ఫోన్‌లో మాట్లాడి ఖాళీలు భర్తీ చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులను పలు పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఆతర్వాత మధ్యాహ్న భోజన కార్మికులకు పలు సూచనలు చేశారు.

ఎంపీడీఓ కార్యాలయంలో సీఈఓ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ వినోద్

కామేపల్లి: కామేపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని జెడ్పీ సీఈఓ వినోద్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించిన ఆయన పలు అంశాలపై ఆరా తీశారు. మండలంలోని కొమ్మినేపల్లి గ్రామపంచాయతీకి సంబంధించి రూ.కోట్లలో నిధులు దుర్వినియోగం కాగా, ఉద్యోగులపై చర్యలు తీసుకోవడం లేదని ఈనెల 16న 'సాక్షి'లో 'రూ.కోట్లు కాజేసిన వారిపై చర్యలేవీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో జెడ్పీ సీఈఓ ఈ అంశంపై ఆరా తీసినట్లు సమాచారం. నిధుల దుర్వినియోగంపై అప్పట్లో చేపట్టిన విచారణ, తీసుకున్న చర్యలపై పూర్తి స్థాయిలో వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కాగా, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, ఇతర సమస్యల పరిష్కారం, తాగునీటి ఎద్దడి ఎదురుకాకుండా తీసుకోవాల్సిన చర్యలపై మండల అధికారులకు సూచనలు చేశారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెరగాలి

- అదనపు కలెక్టర్ సత్యప్రసాద్
- పెద్దాస్పత్రిలో ఆకస్మికంగా తనిఖీ, సేవలపై ఆరా



దయాలసిస్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

ఖమ్మం వైద్యవిభాగం: ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యంపై భరోసాతో వచ్చే ప్రజల్లో నమ్మకం పెరిగేలా సేవలందించాలని అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలోని విభాగాలను పరిశీలించిన ఆయన, ఎస్‌ఆర్‌సీ, మిల్క్ బ్యాంక్, ఓపీ బ్లాక్, క్యాథల్యాబ్, క్యాజువాలిటీ, ఎక్స్‌రే, ల్యాబ్‌లను పరిశీలించారు. అనంతరం ఆరోగ్యశ్రీ వార్డుకు వెళ్లి రోజుకు ఎందరికి చికిత్స అందుతుందో తెలుసుకున్నారు. ఆతర్వాత దయాలసిస్ సెంటర్‌కు వెళ్లి వివరాలు తెలుసుకున్న ఆయన దయాలసిస్ కోసం వచ్చేవారికి రవాణా ఖర్చులు సక్రమంగా చెల్లించాలని ఆదేశించారు. ఇటీవల 40 మందికి పైగా డయాలసిస్ పేషంట్లు మృతి చెందిన విషయం 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై కూడా అదనపు కలెక్టర్ ఆరా తీశారు. ఎందుకు మృతి చెందారో పూర్తి వివరాలతో నివేదిక అందజేయాలని సెంటర్ నిర్వాహకులను ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ ఆస్పత్రికి అనుసంధానంగా మెడికల్ కళాశాల ఏర్పాటైనందున మరింత మందికి సేవలందిలంచేలా కృషిచేయాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని.. రోగుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ఆర్‌ఎంఓ బి.అమర్‌సింగ్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ మాధవరావు, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇక విజిలెన్స్ తనిఖీలు ?

- కేఎంసీలో జరిగిన పనులపై ఆరా
- క్షేత్రస్థాయిలో పరిశీలించనున్న అధికారులు
- త్వరలోనే ముగ్గురితో కూడిన బృందం రాక

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మించిన సీసీ, వీడీఎఫ్ రోడ్ల నాణ్యత, వెచ్చించిన నిధులపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. గత మూడు నాలుగేళ్ల కాలంలో కేఎంసీ పరిధిలో వందల కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించారు. ఈమేరకు రోడ్ల నాణ్యత తనిఖీకి ముగ్గురు అధికారుల విజిలెన్స్ బృందం వస్తున్నట్లు సమాచారం. ఇంజనీరింగ్ అధికారులతో పాటు థర్డ్ పార్టీ ప్రతినిధులు రోడ్ల నాణ్యతను జనవరిలో పరిశీలించి పలుచోట్ల నాణ్యత లోపించిందని ఉన్నతాధికారులకు నివేదికలు ఇచ్చారు. వీటి ఆధారంగా కాంట్రాక్టర్లకు అధికారులు నోటీసులు జారీ చేయడమే కాక బిల్లులు నిలిపివేసినట్లు తెలిసింది. ఇంతలోనే విజిలెన్స్ అధికారులు దృష్టి సారించడం చర్చనీయాంశంగా మారింది.

రూ.347 కోట్ల నిధులతో...

నగరంలోని పలుచోట్ల ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులను నిర్మించారు. అంతర్గత రహదారులను సీసీ రోడ్లు, వీడీఎఫ్ రోడ్లుగా వేశారు. గత నాలుగైదేళ్లల్లో కేఎంసీ పరిధిలో సుమారు 700 కి.మీ. మేర రహదారులు నిర్మించగా, ఇందుకోసం సుడా, ఎస్‌డీఎఫ్, సీఎం అసూరెన్స్, కేఎంసీ నిధులను వినియోగించారు. సుమారు రూ.347 కోట్లు వెచ్చించినట్లు రికార్డులు చెబుతున్నాయి. అలాగే, రూ.440 కోట్లకు పైగా నిధులతో 1,200 కి.మీ. మేర సైడ్ డ్రెయిన్లు నిర్మించారు.

పనులపై ఆరా

ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన అభివృద్ధి పనులపై విజిలెన్స్ అధికారుల బృందం ఇప్పటికే ఆరా తీసినట్లు తెలిసింది. గత నాలుగైదేళ్లలో జరిగిన పనులపై ఫిర్యాదులు అందడంతో జాబితా ఆధారంగా వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనుల్లో నాణ్యత లేదని, టెండర్లు వేసిందొకరైతే పనులు ఇంకొకరు చేపట్టినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగానే క్షేత్రస్థాయిలో పరిశీలనకు బృందం వస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే కేఎంసీలో ఈ బృందం సమీక్షలకు ప్రత్యేక గదిని సిద్ధం చేయగా, సోమ లేదా మంగళవారం చేరుకోనున్న బృందం ఇక్కడే వారం పాటు ఉంటుందని సమాచారం.

గడువులోగా సీఎంఆర్ అప్పగించాలి

అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

ఖమ్మం సహకారనగర్: రబీ (2022-23) సీజన్‌కు సంబంధించిన ధాన్యం తాలూకా సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ను గడువులోగా ఎఫ్‌సీఐకి అందజేయాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన పౌరసరఫరాల శాఖ అధికారులు, రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. రబీ 2022-23 సీజన్‌కు సంబంధించి బియ్యాన్ని మిల్లర్లు 21శాతమే ఇచ్చారని తెలిపారు. మిగతా బియ్యాన్ని ఎఫ్‌సీఐకి త్వరగా అప్పగించాలని ఆదేశించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్, డీటీ సురేందర్, రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజేశ్వరరావు, నగేష్ పాల్గొన్నారు.

జమలాపురం ఆలయంలో పూజలు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయాన్ని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సందర్శించారు. ఆయనకు అర్చకులు, అధికారులు స్వాగతం పలకగా శ్రీవారు, అమ్మవార్ల దర్శనం అనంతరం శేషవస్త్రాలతో సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు. ఆతర్వాత అదనపు కలెక్టర్ తహసీల్‌ను సందర్శించి తహసీల్దార్ ఉషాశారదతో పలు అంశాలపై సమీక్షించారు.

తోటలు సాగుచేస్తున్న రైతులు విలవిల

- పూత దశలోనే చీడపీడలతో నష్టం
- పిందెగా మారినా నాణ్యత కోల్పోతున్న కాయలు
- గాలి, దుమ్ము, అకాల వర్షాలతో ఏటా ఇక్కట్లే
- ఫలితంగా జిల్లాలో తగ్గిపోతున్న మామిడి సాగు

మామిడి ఆదుకునేనా?



సిద్ధినేనిగూడెంలో మామిడి తోట (ఇన్‌సెట్) నల్లగా మారుతున్న పూత



కవర్లు తొడిగే విధానాన్ని వివరిస్తున్న అధికారి

మధిర: జిల్లాలో సాగుచేసిన మామిడి తోటలను చీడపీడలు ఆశించడంతో ఆశించిన స్థాయిలో దిగుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో మామిడి రైతులు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం మామిడికి నల్ల నల్లి, ఎర్ర నల్లి, తేనెమంచు పురుగు, తెల్ల దోమ, పచ్చ దోమ ఆశించాయి. ఫలితంగా పూత పిందెగా మారడం లేదు. జిల్లాలో మామిడి తోటలు ఇప్పుడు పిందె దశలో ఉన్నా యి. ఈ సమయాన ఆశించిన తెగుళ్ల కారణంగా ఎదుగుదల లేక పోవడమేకాక పూతతో పాటు పిందెలూ రాలిపోతున్నాయి. దీంతో మామిడి దిగుబడిపై ఆశలు పెట్టుకున్న రైతులు దేవుడిపై భారం వేసి కాలం గడుపుతున్నారు.

31,607 ఎకరాల్లో తోటలు

జిల్లాలో సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి, కల్లూరు, తల్లాడ, కొణిజర్ల, రఘునాథపాలెం, ఎర్రుపాలెం, చింతకాని, ముదిగొండ మండలాల్లో మామిడి సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉంది. జిల్లాలో ఈ ఏడాది వానాకాలం నాటికి 31,607 ఎకరాల్లో మామిడి సాగు చేపట్టారు. కాగా, పూతను పొగ మంచు సమయాన తేనె మంచు పురుగు ఆశించి నల్లని బంక మాదిరి ఏర్పడుతోంది. దీంతో పూత రాలిపోతుండగా.. ఒకవేళ పిందె ఏర్పడి కాయలుగా మారినా కోతకు వచ్చే దశలో మంగు వస్తుంది. ఫలితంగా కాయలు నాణ్యత లేక మార్కెట్‌లో ఆశించిన ధర రాదని రైతులు చెబుతున్నారు.

అసలే ఆలస్యం

సాధారణంగా మార్చి నాటికి మామిడికాయలు కోతకు రావడం, ఏప్రిల్‌లో పండు పక్వానికి రావడం సహజం. కానీ ఈ ఏడాది మార్చి వస్తున్నా చాలావరకు తోటలు పూత, పిందె దశలోనే ఉన్నాయి. ఇదిలా ఉండగా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో అకాల వర్షాలు, గాలిదుమ్ము, వడగండ్ల వానలు కురిసే ప్రమాదం పొంచి ఉంది. గతంలోనూ ఇలా జరగగా మామిడి పంటకు తీరని నష్టం వాటిల్లింది. దీంతో చీడపీడల నుంచి తోటలను కాపాడుకున్నా అకాల వర్షాలతో నష్టం జరిగే ప్రమాదం ఉండడంతో రైతులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతున్నారు.

నష్టాలు భరించలేక..

జిల్లాలో మామిడి, ఆయిల్‌ఫామ్ సాగు వివరాలు (ఎకరాల్లో)

ఏడాది	మామిడి	ఆయిల్ ఫామ్
2019	33,779	4,866
2020	31,994	6,192
2021	33,907	6,918
2022	31,114	9,686
2023	31,607	18,670

ఏటా ఏదో రూపంలో నష్టాలు ఎదురవుతుండడంతో రైతులు మామిడి సాగు విస్తీర్ణాన్ని తగ్గిస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వ పరంగా ప్రోత్సాహం లేకపోవడం, పంటకు మార్కెటింగ్ లేకపోవడం, ధర వచ్చే వరకు శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసే అవకాశం లేక రైతాంగం నష్టపోతోంది. మామిడికాయలను నిల్వ చేసి ధర ఉన్నప్పుడు అమ్ముకునేలా ప్రభుత్వం శీతల గిడ్డంగులను నిర్మిస్తే రైతులు పంట సాగుపై ఆసక్తి చూపే అవకాశముంది. మరోపక్క ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు ఉచితంగా మొక్కలు, డ్రిప్‌పై సబ్సిడీ ఇస్తుండడంతో ఆ పంట సాగు ఏటా పెరుగుతోంది.

అప్పుడప్పుడే దిగుబడి



పూత, పిందె దశలో నల్లి, చీడపీడలు, తేనెమంచు పురుగుతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. పంట చేతికి వచ్చే సమయానికి గాలిదుమ్ము, వడగండ్లతో దెబ్బతింటోంది. నాలుగైదు ఏళ్లకు ఓసారి మంచి దిగుబడి వచ్చినా ధర దక్కడం లేదు.

– పసుమర్తి కృష్ణమూర్తి, మామిడి రైతు, సిద్దినేనిగూడెం

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ప్రకృతి విపత్తులతో నష్టపోతున్న మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవడం లేదు. కాయలకు మంచి రేటు వచ్చే వరకు నిల్వ చేసుకునేలా శీతల గిడ్డంగులు నిర్మించాలి. అలాగే, ఎరువులను సబ్సిడీపై అందించి మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పించాలి.

– రామిశెట్టి కృష్ణమూర్తి, మామిడి రైతు, మర్లపాడు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



రైతులు పూత, పిందెను గమనిస్తూ తెగుళ్లు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. అలాగే, మామిడి కాయలు నాణ్యతగా ఉండేలా కవర్లు తొడిగితే మంచి ఫలితముంటుంది. పిప్రోనిల్, ఎసిఫేట్ మందులతో నల్లి, తేనెమంచు పురుగులను నివారించొచ్చు.

– అనసూయ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, ఖమ్మం

క్లుప్తంగా

హెచ్‌పీఎస్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్‌లోని రామాంతపూర్, బేగంపేటల్లో ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూళ్లలో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఒక్కో పాఠశాలలో ఒక్కో సీటు చొప్పున జిల్లాకు రెండు సీట్లు కేటాయించగా, ఆసక్తి ఉన్న విద్యార్థులు మార్చి 12వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు స్థానికత, పుట్టిన తేదీ, ఆదాయం, కులం ధ్రువీకరణ పత్రాలే కాక రేషన్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు జత చేయాలని పేర్కొన్నారు. మార్చి 15న మధ్యాహ్నం 3 గంటలకు ఖమ్మంలోని అంబేద్కర్ భవనంలో లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు.

ఉపాధి శిక్షణపై వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో పాల్గొన్న యువతతో అధికారులు

వైరా: తెలంగాణ రాష్ట్ర ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యాన ప్రొడక్టివిటీ కౌన్సిల్ నేతృత్వంలో యువతకు నైపుణ్య శిక్షణపై వర్క్‌షాప్ నిర్వహించారు. వైరాలోని కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం ఈ వర్క్‌షాప్ ఏర్పాటుచేయగా, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్, ఏపీసీసీ కోఆర్డినేటర్ సత్యం, శిక్షణ సంస్థ నిర్వాహకుడు వీరబ్రహ్మాచారి పాల్గొని పలు అంశాలపై అవగాహన కల్పించారు. యువత, మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని సూచించారు.

మే 17న పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష

సింగరేణి(కొత్తగూడెం): పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశానికి మే 17న పరీక్ష నిర్వహించనున్నట్లు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ విషయాన్ని కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నాగమునినాయక్ వెల్లడించారు. ప్రవేశపరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఫీజు చెల్లించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులైతే రూ.250, ఇతరులు రూ.500 ఫీజు చెల్లించి అపరాధ రుసుం లేకుండా ఏప్రిల్ 22వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే, రూ.300 జరిమానాతో ఏప్రిల్ 26వరకు ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

ఎమ్మెల్యే లాస్య మృతిపై ఎంపీ, మంత్రి సంతాపం

ఖమ్మంమయూరిసెంటర్ / ఖమ్మం వన్‌టౌన్/ సత్తుపల్లి: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి బాధాకరమని, ఆమెను రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించడం దిగ్భ్రాంతికి గురి చేసిందని ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఆమె తండ్రి సాయన్న మృతి చెందగా, ఆ బాధ నుంచి కోలుకోకున్నా ప్రజాసేవలో వారసత్వాన్ని కొనసాగిస్తున్న లాస్య మృతి ఆవేదన కలిగించిందని తెలిపారు. అలాగే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సైతం వేర్వేరు ప్రకటనల్లో ఎమ్మెల్యే మృతిపై సంతాపం ప్రకటించారు.

నేడు ఐఏఎల్ జిల్లా మహాసభ

ఖమ్మం లీగల్: ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) జిల్లా 9వ మహాసభ శనివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ ఓరుగంటి శేషగిరిరావు, న్యాయవాదులు పెమ్మసాని పట్టాభి, షేక్ లతీఫ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఖమ్మంలోని డీపీఆర్‌సీ భవనంలో ఉదయం 10–30 గంటలకు సభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, భద్రాద్రి జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత్ పాటిల్, ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు దుస్సా జనార్దన్ తదితరులు పాల్గొననుండగా, న్యాయవాదులు విజయవంతం చేయాలని వారు కోరారు.

రూ.10వేల విలువైన గంజాయి స్వాధీనం

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ మండలంలోని కోదాడ క్రాస్ వద్ద ద్విచక్ర వాహనాలపై వెళ్తున్న వారి నుంచి శుక్రవారం పోలీసులు రూ.10వేల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మంకు చెందిన జొన్నలగడ్డ ప్రభురామ్, కొప్పు వరుణ్, పోట్ల ఈశ్వర్, సోమారపు సాయి, ఎనుబరి జాన్‌వెస్లీ ఏదులాపురానికి చెందిన శంకర్ వద్ద ఎండు గంజాయి కొనుగోలు వెళ్తున్నారు. ఈక్రమంలో కోదాడ క్రాస్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వీరిని తనిఖీ చేయగా గంజాయి లభించడంతో అదుపులోకి తీసుకుని ఐదు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

సర్దుబాటు సరే.. జీతాలేవి?

- ఐదునెలలుగా వేతనాలు అందక 104 ఉద్యోగుల అవస్థలు
- సేవలు రద్దు చేశాక ఇతర శాఖల్లోకి ఉద్యోగులు
- వేతనాలు చెల్లించడంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యం
- ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 160 మంది ఉద్యోగుల ఆవేదన


ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో మూలనపడిన 104 వాహనాలు

ఖమ్మంవైద్యవిభాగం: గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సేవలందించిన 104 వ్యవస్థకు గత ప్రభుత్వం మంగళం పలికింది. దీంతో వాహనాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను వివిధ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేసిన ఉన్నతాధికారులు వారికి జీతాలు చెల్లించడంలో మాత్రం తీవ్ర నిర్లక్ష్యం కనబరుస్తున్నారు. వాహనాలను పక్కన పెట్టినప్పటి నుంచి సిబ్బంది సేవలను వినియోగించుకుంటున్నా వేతనాల విషయంలో పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

గతేడాది అక్టోబర్ నుంచి...

104లో పనిచేస్తూ ఇతర శాఖల్లో సర్దుబాటు చేసిన ఉద్యోగులకు గత ఏడాది అక్టోబర్ నుంచి జీతాలు రాకపోవడంతో ఇంటి అద్దె కట్టలేక, కుటుంబాలను పోషించలేక అప్పుల పాలవుతున్నారు. 104 వాహనాల్లో విధులు నిర్వర్తించిన ఉద్యోగులను రెండేళ్ల క్రితం వైద్య ఆరోగ్య, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో సర్దుబాటు చేశారు. ఒక్కో వాహనంలో ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, డ్రైవర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సెక్యూరిటీ గార్డ్ సేవలందించేవారు. ఇలా ఖమ్మం జిల్లాలో 90 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 70 మంది కలిపి 160మంది ఉండగా, 2022 జనవరిలో సేవలు రద్దు చేశాక సిబ్బందిని ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సర్దుబాటు చేశారు. అప్పటి నుంచి జీతాలు నెలనెలా సక్రమంగా చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతూ నెట్టుకొచ్చారు. కానీ గత ఐదు నెలలుగా అసలే వేతనాలు అందకపోవడంతో ఎదురుచూస్తుండగా... ఉన్నతాధికారులు తమ గోడు పట్టించుకొని వేతనాలు చెల్లించాలని వేడుకుంటున్నారు.

తుప్పు పడుతున్న వాహనాలు

మరో పక్క 104 సేవలను రద్దు చేసిన ప్రభుత్వం ఆ వాహనాలను మరిచిపోయింది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న ఈ సేవలు 2008లో అందుబాటులోకి వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 23 వాహనాల ద్వారా సిబ్బంది లక్షల మందికి సేవలందించారు. అయితే, సేవలు నిలిచిపోయాక వాహనాలను వేలం వేసినా ఆదాయం వచ్చేది. లేకపోతే ఇతర అవసరాలకు వినియోగించుకోవాల్సిన ఉన్నా బాగుండేది. అధికారులు ఆ దిశగా ఆలోచన చేయకుండా ఖమ్మం జిల్లాకు కేటాయించిన 11 వాహనాలను జిల్లా జనరల్ ఆస్పత్రిలో పక్కన పెట్టేశారు. దీంతో రెండేళ్లుగా వానకు తడిచి, ఎండకు ఎండి తుప్పుపట్టాయి. పూర్తిగా శిథిలావస్థకు చేరే లోపైనా వాహనాలను వేలం వేస్తే కొంత ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

దుర్భర పరిస్థితి ఎదుర్కొంటున్నాం...



ఐదు నెలలుగా వేతనాలు రాక కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. ఔట్ సోర్సింగ్ వ్యవస్థకు అప్పగించడంతోనే జాప్యం జరుగుతోంది. అప్పట్లో కొందరు తీసుకున్న నిర్ణయాలతో మేం నష్టపోతున్నాం. ఇకనైనా మమ్ముల్ని రెగ్యులర్ లేదా పూర్తిగా కాంట్రాక్ట్ పద్ధతిలోకైనా మార్చి మా బతుకులకు భరోసా కల్పించాలి.

– మన్మథరావు, 104 ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

గ్రామీణ బ్యాంకు ఉద్యోగుల సమ్మె

ఎన్‌ఆర్‌బీఐ ఏర్పాటు, సర్వీస్ రూల్స్ అమలుకు డిమాండ్


ఏపీజీవీబీ ఆర్‌ఎంకు వినతిపత్రం ఇస్తున్న సంఘం ప్రతినిధులు


ఖమ్మంలోని రీజనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: రూరల్ గ్రామీణ బ్యాంకులను నేషనల్ రూరల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎన్‌ఆర్‌బీఐ)గా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో జిల్లాలోని గ్రామీణ బ్యాంకుల ఉద్యోగులు శుక్రవారం సమ్మె నిర్వహించారు. ఖమ్మంలోని ఏపీజీవీబీ ప్రాంతీయ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ఉద్యోగులు పాల్గొనగా, ఏపీజీవీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ బాధ్యులు మాట్లాడారు. స్పాన్సర్ బ్యాంకు విధానాన్ని రద్దు చేసి ఎన్‌ఆర్‌బీఐ ఏర్పాటు చేయాలని, వాణిజ్య బ్యాంకులతో సమానంగా సర్వీస్ రూల్స్, వేతన సవరణ చట్టాలు, పెన్షన్ స్కీం, కంప్యూటర్ ఇంక్రిమెంట్, కారుణ్య నియామకాలు, గ్రాట్యుటీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అలాగే, గ్రామీణ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న 30 వేల పోస్టులు భర్తీ చేయడంతో పాటు తాత్కాలిక ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ కె.గోపరాజు, బాధ్యులు డి.శ్రీను, చంద్రశేఖర్, కట్ల కోటయ్య, నవీన్‌బాబు, శ్రీకాంత్, అన్వేష్, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొనగా, ఏపీజీవీబీ ఆర్‌ఎం భాస్కర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

కల్లంలో ఆరబోసిన మిర్చి చోరీ

కామేపల్లి: మిర్చికి ఇప్పుడిప్పుడే ధర పెరుగుతుండడంతో పంటను రైతులు కంటికి రెప్పలా కాపాడుతుండగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చెందిన రైతు బుర్ర శ్రీను కల్లంలో మిర్చి ఆరబోయగా, గురువారం రాత్రి ఇంటికి వెళ్లి భోజనం చేసి వచ్చేసరికి దుండగులు ఎత్తుకెళ్లారు. సుమారు రూ.30వేల విలువైన క్వింటాన్నర మిర్చిని చోరీ చేయగా, పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధిత రైతు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెనుబల్లి: ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడడంతో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. భద్రాద్రి జిల్లా అన్నపురెడ్డి మండలం మర్రిగూడెం గ్రామానికి చెందిన వేపాకుల వెంకన్న శుక్రవారం ద్విచక్రవాహనంపై తిరువూరు వైపు నుంచి వస్తున్నాడు. ఈ క్రమంలో పెనుబల్లి మండలం బయ్యన్నగూడెం సాయినగర్ సమీపాన బైక్ అదుపుతప్పి కింద పడగా వెంకన్నకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆయన్ను పెనుబల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాఠశాలపై దాడి గర్హనీయం


సమావేశంలో మాట్లాడుతున్న ట్రస్మా బాధ్యులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని క్రియేటివ్ పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి బంధువులు శుక్రవారం చేరుకుని సిబ్బందిపైనే కాక డైరెక్టర్ కౌశిక్‌పై దాడికి దిగడం గర్హనీయమని తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ట్రస్మా) బాధ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుర్రం కాంతారావు, నాయుడు వెంకటేశ్వర్లు, ట్రెజరర్ యలమిశెట్టి నర్సయ్య మాట్లాడుతూ ఫీజు బకాయి విషయమై వాయిదాలు ఇచ్చినా చెల్లించకపోగా పాఠశాల బాధ్యులు, సిబ్బందిపై దాడికి దిగారన్నారు. ఈవిషయం తెలుసుకున్న ట్రస్మా రాష్ట్ర కన్వీనర్ ఐ.వీ.రమణారావు, అసోసియేషన్ బాధ్యులు కాంతారావు, ఎం.డీ.మతీన్, శ్రీకాంత్, సూరిబాబు, వంగా సాంబశివారెడ్డి, వీరన్న, న్యూవిజన్ ప్రసాద్, హార్వెస్ట్ రవిమారుత్, గీతాంజలి అప్పారావు తదితరులు పాఠశాలకు చేరుకుని వివరాలు ఆరా తీశారు. కాగా, ఘటనపై త్రీటౌన్ సీఐ రమేష్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఉద్యోగులు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలి

భద్రాచలం: ఉద్యోగులు ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ కుటుంబాలను తీర్చిదిద్దుకోవాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులు, సిబ్బందికి అవగాహన కల్పించేలా బ్యాంకర్లు, ఇన్వెస్టర్లతో నిర్వహించిన సదస్సులో పీఓ మాట్లాడారు. ఉద్యోగులు పలువురు అవగాహన లేక వివిధ రంగాల్లో పెట్టుబడి పెట్టి నష్టపోతున్నట్లు గుర్తించి సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏళ్ల పాటు ఉద్యోగాలు చేసే వారు జాగ్రత్తగా పొదుపు చేస్తూ రిటైర్ అయ్యాక ఇబ్బందులు ఎదురుకాకుండా చూసుకోవాలన్నారు. అనంతరం వివిధ బ్యాంకుల ప్రతినిధులు డబ్బు పొదుపుకు ఉన్న అవకాశాలు, కాలపరిమితితో కూడిన డిపాజిట్లు, బీమా పథకాలు తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఐటీడీఏ ఉద్యోగులు సురేశ్‌బాబు, రమణయ్య, నర్సింహారావు, ఆదినారాయణ, హరికృష్ణ, బ్యాంకుల ప్రతినిధులు హేమంత్, స్పందన, రమేశ్, ముకేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అటవీ వ్యవసాయంపై శిక్షణ


శిక్షణలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, అధికారులు, రైతులు

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడెంలో గిరిజనులకు అటవీ వ్యవసాయ పద్ధతులపై శిక్షణ ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ ఏవీ రామాంజనేయులు ఆధ్వర్యాన ఈ శిక్షణ ఇవ్వగా, జామాయిల్, పామాయిల్, జీడిమామిడి, కుంకుడు తదితర పంటల సాగు, అందులో సాగుకు అవకాశమున్న అంతర పంటలు, ఎరువుల యాజమాన్యం, సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తగూడెం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మతోపాటు రంగారావు, రమేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సును ఢీకొట్టిన లారీ

త్రుటిలో తప్పిన ప్రమాదం, ఒక విద్యార్థికి తీవ్ర గాయాలు


గాయపడిన విద్యార్థి అయాన్



ఘటనలో దెబ్బతిన్న స్కూల్ బస్సు వెనక భాగం

ఖమ్మంక్రైం: ఖమ్మం బైపాస్‌రోడ్డులోని టేకులపల్లి బ్రిడ్జి వద్ద ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును లారీ ఢీకొనగా అందులో ఉన్న ఒక విద్యార్థికి తీవ్రగాయమైంది. మిగతా వారంతా సురక్షితంగా బయటపడడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని కాకతీయ టెక్నో స్కూల్ విద్యార్థులు 30 మందితో శుక్రవారం సాయంత్రం బస్సు బయలుదేరింది. ఈక్రమంలో బైపాస్ రోడ్డులో టేకులపల్లి వెళ్లడానికి డ్రైవర్ యూ టర్న్ తీసుకుంటుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగం నుజ్జునుజ్జు కాగా వెనక వైపు కూర్చున్న టేకులపల్లికి చెందిన అయాన్ తలకు అద్దాలు తాకడంతో తీవ్రగాయమైంది. ఒక్కసారిగా జరిగిన ఘటనతో పిల్లలు హాహాకారాలు చేయగా.. యూ టర్న్ తీసుకునే సమయాన బస్సు సాధారణ వేగంతోనే ఉండగా ప్రమాదం తప్పినట్లయిది. అనంతరం అయాన్‌ను 108లో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించగా, ప్రస్తుతం పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. ప్రమాదం జరిగిందని తెలియగానే విద్యార్థుల తల్లిదండ్రులు చేరుకుని పరిస్థితిపై ఆరా తీశారు. కాగా, ఖమ్మం టూ టౌన్ పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

అదుపుతప్పి పల్టీ కొట్టిన ఆటో

10 మంది కూలీలకు తీవ్ర గాయాలు


ఘటనాస్థలంలో క్షతగాత్రులు

కల్లూరురూరల్: కల్లూరు మండలంలోని పెద్దకోరుకొండి వద్ద శుక్రవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పది మంది కూలీలకు తీవ్ర గాయాలయ్యాయి. తల్లాడ మండలం కుర్నవెల్లి నుంచి ఆంధ్రాలోని ఎన్టీఆర్ జిల్లా ఊటుక్కూరుకు మొక్కజొన్న కంకులు విరిచేందుకు గాను ఆటోలో కూలీలు బయలుదేరారు. ఈక్రమంలో పెద్దకోరుకొండి రైతు వేదిక వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమాన ఆటో బోల్తా పడగా, ఈలప్రోలు సైదా, ఈలప్రోలు రాధమ్మ, మల్లారపు భద్రమ్మ, సీమకుర్తి కృష్ణమ్మ, సూరం ఈశ్వరమ్మ, మల్లారపు ఈశ్వరి, బండి పద్మ, సీమకుర్తి వెంకమ్మ ఎదుల పద్మతో పాటు ఆటో డ్రైవర్ వెంకటేశ్వర్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు క్షతగాత్రులను కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. ఘటనా స్థలాన్ని కల్లూరు ఎస్సై ఎస్.కే.షాకీర్ సందర్శించి కేసు నమోదు చేయగా, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి వైద్యులకు ఫోన్‌లో సూచించారు.

క్రీడాకారులకు మంత్రి పొంగులేటి ఆర్థికసాయం

ఖమ్మంవన్‌టౌన్: సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు హైదరాబాద్‌లో శనివారం ప్రారంభం కానున్నాయి. ఈ పోటీలకు జిల్లా నుండి వెళ్తున్న క్రీడాకారులకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ మేరకు నగదును క్రీడాకారులు కూసుమంచి మండలానికి చెందిన భూక్యా వేణు మాధవన్, వెంకటేష్, వడిత్యా విజయ్, గుగులోత్ శ్రీకాంత్‌కు మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి శుక్రవారం అందజేశారు.

సమీకృత గురుకుల పాఠశాలకు స్థల సర్వే

చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ మండలంలో సమీకృత గురుకుల పాఠశాల నిర్మించనున్నట్లు ప్రకటించగా, పైలట్ ప్రాజెక్టుగా మధిర నియోజకవర్గాన్ని ఎంపిక చేశారు. ఈమేరకు చింతకాని మండలంలోని లచ్చగూడెంలో అనువైన ప్రభుత్వ స్థలం గుర్తింపుపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా రెవెన్యూ, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు శుక్రవారం సర్వే చేశారు. గ్రామంలోని స్టేడియం వద్ద ఉన్న ప్రభుత్వ స్థలాన్ని అధికారులు పరిశీలించారు. ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, తహసీల్దార్ రమేష్, ఎంపీడీఓ రామయ్య, డీఈ వైకుంఠచారి, ఉద్యోగులు గంగాప్రసాద్, ఉష, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న రిటైర్డ్ ఏఎస్సై మృతి


ప్రసాద్ (ఫైల్)

మధిర: ఇటీవల కొణిజర్ల సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిటైర్డ్ ఏఎస్సై మన్నేపల్లి ప్రసాద్ (63) శుక్రవారం మృతి చెందారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనకు ఖమ్మం ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఈమేరకు మధిరలోని నివాసంలో టీడీపీ నాయకులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, మల్లాది హన్మంతరావు తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి, ప్రసాద్ సతీమణి రత్నకుమారి, కుటుంబీకులను పరామర్శించారు.

గుండెపోటుతో రిటైర్డ్ తహసీల్దార్..


నర్సింహారావు (ఫైల్)

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం గుట్టలబజార్‌లో నివాసముంటున్న రిటైర్డ్ తహసీల్దార్ నున్నా నర్సింహారావు (78) శుక్రవారం గుండెపోటుతో మరణించారు. దమ్మపేట, కూనవరం తదితర మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఆయన కలెక్టరేట్‌లో ఏఓగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందారు. ఆయనకు భార్య రాజేశ్వరితో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, రిటైర్డ్ అయ్యాక గుట్టలబజార్‌లోని శ్రీ విఘ్నేశ్వర సహిత దాసాంజనేయ స్వామి ఆలయ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న నర్సింహారావు మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు ఆయన మృతదేహం వద్ద డాక్టర్ గంగరాజు, కార్మిక సంఘాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నున్నా మాధవరావు, ధనాల కొండయ్య, నున్నా సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

మేడారం వెళ్లివస్తూ...

కామేపల్లి: కుటుంబ సమేతంగా మేడారంలో వనదేవతల దర్శనానికి వెళ్లిన వ్యక్తి తిరుగు ప్రయాణంలో గుండెపోటుతో మృతి చెందాడు. మండలంలోని పండితాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బత్తుల చంద్రయ్య(55) భార్య, కూతురుతో కలిసి గురువారం మేడారం వెళ్లాడు. అక్కడ దర్శనం అనంతరం శుక్రవారం వస్తుండగా గుండెపోటుకు గురయ్యాడు. దీంతో ఆయనను 108 వాహనంలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

ఒకేరోజు ఇద్దరు మాజీ సర్పంచ్‌లు...


ఫక్రుద్దీన్, అహ్మద్ అలీ (ఫైల్)

మధిర: ఒకే రోజు ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు మృతి చెందడంతో విషాదం నెలకొంది. మధిర మండలం ఖాజీపురానికి చెందిన మాజీ సర్పంచ్ అహ్మద్ అలీ(50) కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతుండగా హైదరాబాద్ నిమ్స్‌లో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. అదే గ్రామానికి చెందిన మరో మాజీ సర్పంచ్ షేక్ ఫక్రుద్దీన్(75) మధిరలోని ముస్లిం బజార్‌లో నివసిస్తున్నారు. ఆయన సైతం అనారోగ్యం బారిన పడగా ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించడంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మాజీ సర్పంచ్‌ల మృతిపై షేక్ నజీర్, జమీర్, కమాల్ తదితరులు సంతాపం ప్రకటించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

తిరుమలాయపాలెం: కుటుంబ కలహాల కారణంగా గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందగా శుక్రవారం కేసు నమోదైంది. మండలంలోని సుద్దవాగుతండాకు చెందిన బానోతు కల్యాణ్(25) మద్యానికి బానిస కావడంతో వచ్చిన డబ్బులన్నీ తాగుడుకే వెచ్చిస్తున్నాడని భార్య సునీ మందలించింది. దీంతో ఈనెల 14న ఆయన గడ్డిమందు తాగగా హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కల్యాణ్ శుక్రవారం మృతి చెందగా, కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కారేపల్లి: మండలంలోని సీతారాంపురానికి చెందిన కుటుంబం మేడారం వెళ్లగా దుండగులు వారి ఇంట్లో చోరీ చేశారు. గ్రామానికి చెందిన వీరెల్లి శ్యాంసుందర్ కుటుంబం ఈనెల 21న మేడారం వెళ్లడంతో దుండగులు తలుపులు, బీరువా తాళాలు పగలగొట్టి రూ.1.50లక్షల విలువైన మూడు తులాల బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లారు. శుక్రవారం బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజారాం తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

కల్లూరు/కల్లూరురూరల్: మండలంలోని పెద్దకోరుకొండి సమీపాన కోడిపందేల స్థావరంపై పోలీసులు శుక్రవారం దాడి చేశారు. ఈసందర్భంగా ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.1,470 నగదు, మూడు కోడి పుంజులు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ షాకీర్ తెలిపారు.